క్లుప్తంగా

వర్షం కోసం దేవుళ్ల విగ్రహాలకు జలాభిషేకం

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లులో శనివారం వర్షం కోసం గ్రామంలోని దేవుళ్ల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఓబులేషు స్వామి, ఈశ్వర స్వామి, మారెమ్మ, సుంకులమ్మ, బొడ్రాయి, ఆంజినేయస్వామి దేవుళ్లకు 108 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుకున్నారు.

పరిశుభ్రతతోనే దోమల కట్టడి

ఆలూరు రూరల్: పరిశుభ్రతతోనే దోమల వ్యాప్తిని అరికట్ట వచ్చని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మొలగవల్లి గ్రామంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగతంతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. డ్రమ్ములు, కుండీలు, పాతటైర్లతోపాటు పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, ఎంఎల్‌హెచ్‌పీ రజని, ఏఎన్‌ఎం రుక్మిణి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగస్వామికి జలాభిషేకం

ఎమ్మిగనూరుటౌన్: పురపాలక సంఘం పరిధిలోని వెంకటాపురం సుభిక్షంగా వుండాలని శనివారం గ్రామస్తులు తుంగభద్ర నదికి వెళ్లి జలాలను తీసుకొని వచ్చి గ్రామంలోని గుంటి రంగస్వామికి జలాభిషేకం చేశారు. ఏటా శ్రావణ మాసంలో గుంటి రంగస్వామికి తుంగాజలాలతో అభిషేకం చేయడం ఆనవాయితీ. దీనిని కొనసాగిస్తూ కాలనీ వాసులు ఈ ఏడాది కూడా వందలాది మంది 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుంగభద్ర నది వద్దకు కాలినడకన వెళ్లి తుంగా జలాలను తీసుకొని గోవింద నామస్మరణంలో తరలివచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. వార్డు కౌన్సిలర్ బజారి, మాజీ కౌన్సిలర్ భాస్కర్ రెడ్డితో పాటు వార్డు పెద్దలు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం నిర్వహించనున్న ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహాసభకు ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని స్థానిక ఆర్టీసీ డిపో ఎస్‌ఎంయూఏ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక డిపో అధ్యక్షుడు ఎస్‌ఎం రఫీక్, డిపో అడ్వయిజర్ గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌పీఎం సాహెబ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర మహసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ డిపో కార్యదర్శి ముస్తాక్ అహమ్మద్, గ్యారేజీ నాయకులు భాస్కర్, కోసిగయ్య, కేఎం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

23న చేపల పెంపకానికి వేలం

వెల్దుర్తి: అటవీ పరిధిలోని స్థానిక వీరన్నగట్టు చెరువులో చేపల పెంపకానికి వేలం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సూర్యచంద్ర రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం కర్నూలులోని రేంజ్ కార్యాలయంలో ఉదయం 10గంటల ప్రాంతంలో ప్రారంభిస్తామన్నారు. వేలం దక్కించుకున్నవారికి ఏడాది పాటు చేపల పెంపకం, అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. వేలం ముగిసిన వెంటనే పాటదారుడు పూర్తి పైకం పన్నులతో కలుపుకుని చెల్లించాలన్నారు.

ఎలాంటి విభేదాలు లేవు



మాట్లాడుతున్న ఎంపీపీ జూటూరు హేమలత

చిప్పగిరి: మంత్రి గుమ్మనూరు జయరాంకు తమకు మధ్య ఎలాంటి వేభేదాలు లేవని ఎంపీపీ జూటూరు హేమలత, మారయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ టీవల పలు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో తమకు మంత్రి జయరాంకు మధ్య విబేదాలు ఉన్నాయని, అందుకే పార్టీ కార్యక్రమాలకు మంత్రి జయరాం దూరంగా ఉన్నారని పలు కథనాలు ప్రచురితమయ్యాయని, అయితే వాటిలో వాస్తవం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ తమకు ఓ కుటుంబం అని అన్నారు. కుటుంబంలో చిన్న సమస్యలు ఉండడం సహజమని, అయితే వీటిపై అతిగా ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. ప్రజలలో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఆదరణ, మంత్రి జయరాం ఎదుగుదలను ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికలలో మంత్రి జయరాం సూచనల మేరకు పార్టీ గెలుపే ధ్యేయంగా తమవంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. నాయకులు లాల్ స్వామి, లింగన్న, రాజు పాల్గొన్నారు.

భూమి పుత్ర సేవలను సద్వినియోగం చేసుకొండి

చిప్పగిరి: భూమి పుత్ర ద్వారా అందే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. చిప్పగిరి, నగరడోణ, బెల్డోణ, నేమకల్లు, గ్రామాల రైతుల భాగస్వామ్యం, నాబార్డు సహకారంతో సీఎస్ఎస్ పథకంలో భాగంగా ఎవర్ట్ సంస్థ చిప్పగిరిలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తి దారుల కంపెనీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీ ద్వారా రైతులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సీఈఓ స్వర్ణలత, డైరెక్టర్లు, గోవిందరాజులు, కోఆర్డి నేటర్ భానోదయ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం..దివ్యాంగులకు వరం!

- ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- భవిత కేంద్రాల ద్వారా వివిధ సేవలు
- ఇంటి వద్దే పాఠాలు
- వారంలో రెండు రోజులు ఫిజియోథెరపీ
- నియోజకవర్గంలో 857 మంది మానసిక, అంగవైకల్య విద్యార్థులు



ఆలూరు భవిత కేంద్రంలో దివ్యాంగులకు పాఠాలు బోధిస్తున్న ఐఈఆర్పీ.



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆలూరు రూరల్: శారీరక వైకల్యంతో బాధపడుతూ తోటి పిల్లలతో సమానంగా చదువుకోలేక తల్లడిల్లే చిన్నారుల బంగారు భవిత కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. మండల కేంద్రాల్లో భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలు అందిస్తోంది. ఆయా కేంద్రాల ద్వారా దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారు త్వరగా కోలుకునేలా ఫిజియోథెరపీ చేయిస్తోంది. దీంతో పాటు వారు సులువుగా చదువుకునేలా సహిత విద్యను అందించేందుకు రిసోర్స్‌పర్సన్లు, పిల్లల బాగోగులు చూసేందుకు ఆయాలను నియమించింది.

ఆలూరు నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల పరిధిలో 6 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 857 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 70 మంది విద్యార్థులు ఆరు మండలాలల్లోని భవిత కేంద్రాలకు వస్తున్నారు.787 మంది విద్యార్థుల్లో కొంత మంది ఇంటి వద్ద, మరికొందరు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రస్తుతం 70 మంది విద్యార్థులకు ఐఈఆర్పీలు (ఇన్ క్లూజీవ్, ఎడ్యూకేషన్, రిసోర్స్ టీచర్) ఆయాలను నియమించారు. ఈ కేంద్రాలకు వారానికి ఒక సారి ఫిజియోథెరపీ వచ్చి వ్యాయామం చేయిస్తారు. దీంతో పాటు ఇంట్లో వ్యాయామం ఎలా చేయాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ప్రతి శనివారం కదల్లేని పిల్లల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, తల్లిదండ్రులకు ఆ పిల్లలతో ఎలా ఉండాలో తెలియజేస్తారు.

వరంగా మారిన కేంద్రాలు

భవిత కేంద్రాలు దివ్యాంగుల పాలిట వరంగా మారాయి. వివిధ అంశాల్లో సాధారణ పిల్లల మాదిరిగా వారిని తీర్చిదిద్దుతున్నారు. వారిలో దాగిన సృజనాత్మకతను వెలికి తీస్తున్నారు. అందరి పిల్లలతో దివ్యాంగులు కలిసి జీవనం సాగించేలా ఐఈఆర్పీలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు గృహ స్థాయిలో ఫిజియోథెరపీ అందిస్తున్నారు. ప్రతి సోమవారం ఆలూరులోని భవిత కేంద్రంలో మంగళ, బుధవారాల్లో భవిత కేంద్రాలైన చిప్పగిరి, ఆస్పరిలో, హలహర్వి, దేవనకొండ, హొళగుంద మండలాల్లో ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం భవిత కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న మానసిక వికలాంగులకు హోమ్ బెస్ట్ ఎడ్యుకేషన్ ద్వారా ఇంటి వద్దకెళ్లి పాఠాలు బోధిస్తున్నారు. 21 రకాల మానసిక, అంగవైకల్యం సోకిన విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రశస్థ యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. దీంతో వారికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు పరికరాలు, అలవెన్సులు సులువుగా దరిచేరుతున్నాయి.

దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు

గత ప్రభుత్వం దివ్యాంగులపై చిన్న చూపు చూసింది. దివ్యాంగులకు జీవితాల్లో వెలుగు నింపాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భవిత కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. దివ్యాంగ విద్యార్థులకు కావాల్సిన ఉపకరణాలైన వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, నాణ్యమైన పరికరాలు అందిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత రెండేసి సార్లు అందించడమే కాక వారిపై



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

మరింత దృష్టి పెట్టి ఫిజియోథెరపీ, బ్రెయిలీ, స్పీచ్ థెరపీ, మానసిక వికలాంగులకు ప్రత్యేక శిక్షణలు అందిస్తున్నారు.

భవిత సేవలు బాగున్నాయి



మా పాప పేరు శ్రీనిధి. పుట్టుక నుంచి వినికిడి సమస్య ఉంది. భవిత కేంద్రంలో రెండో తరగతి చదవుతోంది. సైగల ద్వారా పాఠాలు నేర్పిస్తున్నారు. చిన్నతనంలో వినికిడి సమస్య ఉండడంతో మా పాప చదువుపై ఎంతో దిగాలు చెందాం. ఇప్పుడు అందరి పిల్లలాగే మా పాప కూడా అన్ని పాఠాలు నేర్చుకుంటోంది. భవిత కేంద్రంలో అన్ని సౌకర్యాలతో పాటు సేవలు బాగా ఉన్నాయి.

– మంజుల, దివ్యాంగురాలి తల్లి, ఆలూరు

అందరి పిల్లలతో మెలిగేలా అవగాహన కల్పిస్తున్నాం



దివ్యాంగులు అందరి పిల్లలతో మెలిగేలా అవగాహన కల్పిస్తున్నాం. వారి జీవిత కాలం పెంచేందుకు కృషి చేస్తున్నాం. వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు శిక్షణ ఇస్తున్నాం. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, నడవలేని స్థితిలో ఉన్నవారికి ఇంటి వద్ద విద్యను అందిస్తున్నాం.నియోజకవర్గంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఎవరైనా ఉంటే భవిత కేంద్రాల్లో సంప్రదించాలి.

– రామదాసు, ఐఈఆర్పీ, ఆలూరు

కూలిన రైల్వే హైట్ గేజ్

తుగ్గలి: భారీ వాహనాలు రాకుండా ఉండేందుకు తుగ్గలి రైల్వే బ్రిడ్జి ముందు ఏర్పాటు చేసిన హైట్ గేజ్ శుక్రవారం రాత్రి లారీ ఢీ కొట్టడంతో కూలిపోయింది. దీంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రైల్వే స్టేషన్ దారి మీదుగా వెళుతున్నాయి. హైట్ గేజ్‌ను తరచూ లారీలు ఢీకొడుతుండడంతో రైల్వే అధికారులకు సమస్యగా మారింది. వాహనాలు కూడా ఊర్లో నుంచి కాకుండా చివర నుంచి వెళ్తుండడంతో చిన్నచిన్న వాహనాల ప్రయాణికులకు సైతం ఇబ్బందిగా మారుతోంది. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పంటలను నమోదు చేసుకోవాలి

హాలహర్వి : ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగుచేసిన ప్రతి పంటను నమోదు చేసుకోవాలని ఏఓ శివశంకర్ రైతులకు సూచించారు. మండలంలోని సిద్దాపురం గ్రామం రైతుభరోసా కేంద్రాన్ని శనివారం ఏఓ తనిఖీ చేశారు. ఈ సీజన్‌లో వేసిన పంటలను జియోట్యాగ్ ద్వారా ఈ క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

26న మండలమీట్

ఆలూరు రూరల్: ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ మీటింగ్ హాల్‌లో ఈ నెల 26వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్లబకాష్ శనివారం ప్రకటనలో తెలిపారు.

ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

నందవరం : ఔషధ, సుంగధ మొక్కల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో చరణ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గ్రామీణ ఔషధ మొక్కల గోడౌన్, డ్రాయింగ్ యార్డ్‌ను ఆయన ప్రారంభించారు. శిల ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.18 లక్షలతో గ్రామీణ ఔషధ మొక్కల గోడౌన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ గోడౌన్‌లో 5 వేల బస్తాలు నిల్వ చేయవచ్చని, ఔషధాలను ఆరబెట్టు కోవాడానికి ప్లాట్‌ఫామ్ నిర్మించామన్నారు.

అన్ని వర్గాలు మెచ్చేలా జగనన్న పాలన

ఎమ్మిగనూరురూరల్: అన్ని వర్గాలు మెచ్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం మండల పరిధిలోని మసీదపురం గ్రామ వీధుల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీలకతీతంగా ప్రజలకు అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలను గుర్తించుకోవాలని చెప్పారు. ప్రతి నెల 1వ తేది ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్నారని, తెలిపారు. విద్యా, వైద్యానికి రూ. కోట్లు ఖర్చుపెడుతున్నారని చెప్పారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారని వివరించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ నాగమ్మ, ఎంపీటీసీ జయలక్ష్మీ, వైస్ సర్పంచ్ చిన్న తిప్పన్న, నాయకులు రాముడు, హనుమంతు, రామాంజనేయులు, హనుమప్పనాయుడు, రమేష్, కె, బీరప, ఓంకారప్ప పాల్గొన్నారు.



వృద్ధురాలుకి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి

పత్తికొండటౌన్: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటల వివరాలను ఈ-క్రాప్ లో నమోదు చేయించుకోవాలని ఏఓ వెంకటరాముడు సూచించారు. శనివారం ఏఓ వెంకటరాముడు పత్తికొండ, దూదేకొండ, కోతిరాళ్ల రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. పొలాలకు వెళ్లి ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ రియాజ్‌భాష, వీఏఏలు శివమ్మ, మల్లేశ్, అలీమ్, శ్రీకాంత్, రాజేశ్వరి పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



మహిళలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మురళీధర్‌రెడ్డి

పత్తికొండ రూరల్ : మహిళలు స్వశక్తితో ఎదగాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక తేరుబజారులోని కార్యాలయంలో సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో టైలరింగ్‌కు మంచి ఆదరణ ఉందన్నారు. శిక్షణ సద్వినియోగం చేసుకుని ఉత్తీర్ణులైన వారికి ఉచితంగా కుట్టుమిషన్లు కూడా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు కోటేశ్వరరావు, సభ్యు లు బారికి బస్సన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర భూ రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి

నందవరం : గ్రామాల్లో సమగ్ర భూ రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు డిప్యూటీ తహసీల్దార్ రఘువీర, మండల సర్వేయర్ అక్బర్‌బాషా సూచించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమగ్ర భూ రీసర్వే, క్రాప్ బుకింగ్‌పై జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను రెవెన్యూ అధికారులు తిలకించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జెర్మియా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఎమ్మిగనూరుటౌన్: మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నేతృత్వంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మిగనూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. దాదాపు రూ.4కోట్లతో పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోని ఎల్‌ఐసీ కార్యాలయం మీదుగా నిర్మించిన బీటీ రోడ్డుతో పాటు, వెంకటాపురం కాలనీ, సోగనూరు, లక్ష్మణ్ టాకీస్ వద్ద నిర్మించిన బీటీ రోడ్లను, వాటిపై వేస్తున్న జీబ్రా లైన్లను శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఎర్రకోట మాట్లాడుతూ పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని గుర్తు చేశారు. ప్రస్తు తం మరో నాలుగు కోట్లకుపైగా నిధులను వెచ్చించి రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణాలకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. త్వరలో ఆయా పనులు కూడా చేపట్టడం జరుగుతోందన్నారు. అదేవిధంగా మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, కౌన్సిలర్ శివప్రసాద్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ వడ్డే రంగన్న, గట్టు ఖాజ, మురహరిరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- కోగిలతోటలో గడప గడపకు మన ప్రభుత్వం



కోగిలతోటలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి

హొళగుంద: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం నియోజకవర్గ నాయకుడు నారాయణస్వామితో కలిసి కోగిలతోట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ నాలుగేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందన్నారు. చేసిన మేలును చూసి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ధైర్యంగా అడిగిన నేత దేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసినా ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. అందుకు ఆయన తన పాలన గురించి చెప్పలేకపోతున్నారన్నారు. బాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. వానలు పడక రైతులు అప్పులపాలయ్యారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతులు పాడిపంటలతో వర్ధిల్లుతున్నారన్నారు. ఈ నాలుగేళ్లలో కోగిలతోట గ్రామానికి సంక్షేమ పథకాలు, బీమా ద్వారా రూ.10.58 కోట్లు అందాయన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతకు ముందు మంత్రి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలను సకాలంలో అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, గ్రామ సర్పంచ్ యాట గురుపాదమ్మ, ఎంపీపీ తనయుడు ఈశా, సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కోగిలతోట శేషప్ప, నాగప్ప, వెంకటేష్, ఎంపీటీసీలు మల్లికార్జున, కెంచప్ప, హనుమప్ప, మల్లయ్య, మాజీ జెడ్పిటీసీ రాంభీంనాయుడు, కన్నయ్య, రామకృష్ణ, దర్గప్ప, మేలగిరి, చంద్ర, సోమిరెడ్డి, భీమలింగ పాల్గొన్నారు.

నేడు జేసీఎస్ కన్వీనర్ల సమావేశం

ఆలూరు: నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లతో మంత్రి గుమ్మనూరు జయరాం ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాలు, చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించడంతో పాటు వైఎస్ఆర్‌సీపీ బలోపేతం తదితర వాటిపై చర్చించనున్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు తప్పక హాజరు కావాలని మంత్రి శనివారం ఓ ప్రకటనలో చెప్పారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

హొళగుంద: ఇంటి వద్దకే పాలన అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగ నిలిచిందని, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఇటు వైపు చూస్తున్నారని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం మంత్రి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు నారాయణ స్వామి, సర్పంచ్ చలవాది రంగమ్మతో కలిసి రూ. 40 లక్షలతో హొళగుందలో నూతనంగా నిర్మించిన సచివాలయం-3 భవనాన్ని ప్రారంభించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సచివాలయ ఉద్యోగులు, వంలటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో సేవలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, ఎంపీపీ తనయుడు ఈశా, సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున, ఎంపీటీసీలు మల్లికార్జున, కెంచప్ప, హనుమప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కోగిలతోట శేషప్ప, వెంకటేష్, నాగప్ప, మేలగిరి, రామకృష్ణ, దర్గప్ప, గిరి, సోమిరెడ్డి, చంద్ర, మాజీ జెడ్పీటీసీ రాంభీంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉప పోరు ప్రశాంతం

- అత్యధిక వార్డు స్థానాలు వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులు కైవసం
- ఎల్ నగరంలో రికార్డు స్థాయి మెజారిటీ



ఎల్ నగరం పంచాయతీలో 2వ వార్డు స్థానాన్ని గెలుపొందిన నక్కలోకేశ్‌కు డిక్లరేషన్ ఫారం అందిస్తున్న ఆర్‌ఓ అక్బర్ బాషా



బోయ వరలక్ష్మి, సుళువాయి



బసవన్నగౌడ్ గారి గోపాలమ్మ, మద్దిలింగదహళ్లి

వెల్దుర్తి: గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల స్థానాలకు శనివారం నిర్వహించిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. వెల్దుర్తి మండలంలో మొత్తం నాలుగు వార్డు స్థానాలుండగా అందులో మూడు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. కలుగొట్ల గ్రామ పంచాయతీలో 11వార్డు, కృష్ణాపురం పంచాయతీలో సిద్ధిన గట్టు 10 వ వార్డు స్థానాలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన బొమ్మిరెడ్డిపల్లె 3వ వార్డు మెంబరు స్థానానికి, ఎల్. నగరం (పిక్కిలివానిపల్లె 2వ వార్డు)స్థానాలకు మండల ఎన్నికల అధికారి/ఎంపీడీఓ శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికలు జరిగాయి. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగింది. మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఎల్ నగరంలో మొత్తం 197 ఓట్లు పోలవగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు నక్కలోకేశ్ 150 ఓట్లు సాధించి ప్రత్యర్థిపై గెలుపొందాడు. బొమ్మిరెడ్డిపల్లె వార్డు స్థానానికి టీడీపీ మద్దతుదారుడు కోదండపాణి గెలుపొందాడు. గెలుపొందిన అభ్యర్థులకు ఆర్‌ఓలు రమేష్, అక్బర్‌బాషా డిక్లరేషన్ పత్రాలు అందించారు. కాగా నాలుగు వార్డు స్థానాల్లో మూడు వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులు కైవసం చేసుకోవడంతో సంబరాలు అంబరాన్నంటాయి.ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వెల్దుర్తి సీఐ యుగంధర్, వెల్దుర్తి, తుగ్గలి, కృష్ణగిరి, జొన్నగిరి ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, మల్లికార్జున, సురేశ్, రామాంజనేయులు చర్యలు తీసుకున్నారు.

హొళగుందలో..

హొళగుంద: మండలంలో మూడు వార్డు స్థానాలు ఖాళీగా ఉండగా, ఇందులో రెండు వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులు, ఒకటి టీడీపీ మద్దతుదారులు గెలుచుకున్నారు. మద్దిలింగదహళ్లి 3వ వార్డుకు జరిగిన ఎన్నికల్లో హరిజన మరియమ్మపై వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు బసవన్నగౌడ్ గారి గోపాలమ్మ 16 ఓట్ల మెజార్టీతో గెలిచింది. చిన్నహ్యాట 9వ వార్డును టీడీపీ మద్దతుదారు సీహెచ్ మంగమ్మ గెలుచుకున్నారు. ఇక సుళువాయి 7 వార్డును వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారురాలు బోయ వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఉప ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

దేవనకొండ : మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో వడ్డే లింగన్నకు చెందిన వంద గొర్రెల్లో 36 విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేలింగన్న, మరికొందరు కాపరులు శనివారం ఉదయం 10 గంటల సమయంలో గొర్రెలను మేపడానికి హంద్రీనీవా కాలువపై నుంచి వెళ్తున్నారు. అయితే గద్దెరాళ్ల గ్రామ రైతులు పొలాల్లో కాలువలపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫారం కరెంట్ తీగ తెగిపడి ఉన్న విషయాన్ని గొర్రెల కాపర్లు వడ్డే రమేష్, వడ్డే వంశీ గుర్తించలేదు. గొర్రెలు ఒకదాని తర్వాత ఒకటి కిందపడి మంటలు రావడంతో చుట్టుపక్కల రైతులు, గొర్రెల కాపర్లు, గొర్రెలకు కరెంట్ షాక్ తగిలిందని గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్‌శాఖ ఏఈ నారాయణస్వామి పరిశీలించారు.

కౌలురైతు ఆత్మహత్య



కురవ భీరప్ప

నందవరం: మండల పరిధిలోని గురజాల గ్రామానికి చెందిన రైతు కురవ భీరప్ప(37) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. భీరప్ప తన ఎకరంతో పాటు 10 ఎకరాలు కౌలు తీసుకుని పత్తి, వరి పంటలు సాగు చేశాడు. బ్యాంకులో రూ.2 లక్షలు, సమీప బంధువుల వద్ద రూ.2 లక్షలు అప్పులు అయ్యాయి. పంటలు ఎండిపోవడంతో మనస్తాపం చెందాడు. అదేవిధంగా కడుపు నొప్పిబాధలతో జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం రాత్రి భార్య దస్తగిరమ్మతో గోడవపడి తాను కౌలుకు తీసుకున్న వడ్డె తిమ్మప్ప పొలం వద్ద పురుగు మందు తాగాడు. ఇంటికి వచ్చాక వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కర్నూలుకు రేఫర్ చేశారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతిడికి భార్య దస్తగిరమ్మతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

దేవనకొండ: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవనకొండ మండలం బి సెంటర్ గ్రామానికి చెందిన మారెప్ప (26) తన సొంత పొలంలో శనివారం వ్యవసాయ పనులు చేస్తుండగా ట్రాక్టర్‌తో తిరగబడింది. ఈ ప్రమాదంలో మారెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మారెప్పకు ఏడాదికి క్రితం కీర్తనతో వివాహం అయ్యింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: హైవే 44పై బొమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రాము, శ్రీను మోటార్‌సైకిల్‌పై వెల్దుర్తి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా వెనుక నుంచి గుర్తుతెలియని కారు ఢీకొంది. శనివారం రాత్రి అమెజాన్ హోటల్ సమీపంలో జరిగిన సంఘటనలో మోటార్ సైకిల్‌పై నుంచి క్రింద పడిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఢీకొన్న కారు డ్రైవర్ క్షతగాత్రులను రోడ్డు ప్రక్కకు చేర్చి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.